క్లుప్తంగా

రూ.57.06 లక్షల ఆస్తి పన్ను వసూలు



జెడ్పీ సింహాచలంకు ఆస్తి పన్ను చెక్కులను అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ సిబ్బంది శుక్రవారం రూ.57,06,432 ఆస్తి పన్నును వసూలు చేశారు. 86వ వార్డుకు చెందిన అదిత్రి హౌసింగ్ కార్పొరేషన్ నుంచి రూ.45,13,736, 64వ వార్డుకు చెందిన శ్రావణ్ షిప్పింగ్ నుంచి రూ.11,92,696 పన్నును వసూలు చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను జోనల్ రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్‌ఐలు సుభాన్, రెడ్డి మోహన్, శివ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలానికి అందజేశారు. ఆయన అధికారులను, సిబ్బందిని అభినందించారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

పెదగంట్యాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా ప్రభుత్వ ఐటీఐలో స్కిల్‌హబ్ ద్వారా నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా నైపుణ్యాధికారి సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి, వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. 30 సంవత్సరాల లోపు వయసు ఉండి, పదో తరగతి పాసైన వారు అర్హులని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 81217 43777 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్



పోలీసు విధులను విద్యార్థులకు వివరిస్తున్న సీఐ శ్రీనివాసరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక అరబిందో విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది విధుల గురించి స్టేషన్ సీఐ వి.శ్రీనివాసరావు వివరించారు. రిసెప్షన్, బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరణ, ఎఫ్‌ఐఆర్ నమోదు గురించి తెలియజేశారు. ఎఫ్‌ఐఆర్ నమోదు అనంతరం ఇచ్చే ఎకనాలెడ్జ్‌మెంట్ ఆవశ్యకతను వివరించారు. నిందితులను ఉంచే లాకప్‌ను వారికి చూపించారు. పోలీసులు ఉపయోగించే రైఫిల్స్, రివాల్వర్లను చూపించి, వాటిని వినియోగించే తీరును తెలియజేశారు. కార్యక్రమంలో స్టేషన్ ఎస్‌ఐలు స్వామి నాయుడు, వరలక్ష్మి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ సదస్సుకు హోం మంత్రికి ఆహ్వానం



రాష్ట్ర హోంమంత్రి వనితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'సామాజిక న్యాయం-ప్రభుత్వ రంగ సంస్థలు ' అంశంపై స్టీల్‌ప్లాంట్ ట్రైనింగ్ ఆడిటోరియంలో నవంబర్ 23న నిర్వహించనున్న సదస్సుకు హాజరు కావాలని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆహ్వానించారు. కొవ్వూరులోని మంత్రి క్యాంప్ ఆఫీసులో ఆమెను కలిసి, విశిష్ట అతిథిగా హాజరు కావాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో చాగల్లు వైఎస్సార్ కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, నాయకులు ఉన్నారు.

అందుబాటులో హోమియో వైద్యం

- అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆవరణలో వైద్యశాల
- స్వల్ప, దీర్ఘకాలిక వ్యాధులకు మందులు
- హోమియో వైద్యానికి పెరుగుతున్న ఆదరణ
- పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలతో చక్కటి స్పందన



ఏరియా ఆసత్రి ఆవరణలోని హోమియో వైద్యశాల



ఆస్పత్రిలో సిద్ధంగా ఉన్న హోమియో ముందులు

అగనంపూడి: అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో హోమియో వైద్య సేవలకు ఆదరణ పెరుగుతోంది. గాజువాక మండలం యారాడ పేరుతో ఉన్న హోమియో వైద్యశాలను పుష్కర కాలం క్రితం అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆవరణలోకి తరలించారు. ఆయుష్‌లో భాగంగా అన్ని రకాల వైద్య సేవలను ఒకే ఆవరణలోకి (ఒకే గొడుగు కిందికి) తీసుకురావాలనే ఉద్దేశంతో ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, యునానీ, సిద్ధ, హోమియోపతి) విభాగాలను అగనంపూడి ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు.

పూర్తి స్థాయిలో వైద్యసేవలు

ఆస్పత్రి ఆవరణలో హోమియోపతి, నేచురోపతి విభాగాలకు ప్రత్యేక వసతి కేటాయించడంతో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుతున్నాయి. ఆస్పత్రి ఆధునికీకరణలో భాగంగా గతంలో ఉన్న భవనాన్ని కూల్చివేసి, నూతన భవన సముదాయం నిర్మాణం జరుగుతుండడంతో రోగుల సహాయకులు, అత్యవసర రోగుల కోసం గతంలో కేటాయించిన ఆవరణలో ఈ విభాగాలు నడుస్తున్నాయి. ఆస్పత్రిలో రోజూ 30 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ఆస్పత్రి సిబ్బంది పరిసర గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. డెంగ్యూ, అతిసార, విషజ్వరాల సమయాల్లో విరివిగా శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

డెంగ్యూకు హోమియో పిల్స్

సీజన్‌లో విపరీతమైన మార్పుల కారణంగా విషజ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. అటువంటి వారికి హోమియో వైద్యం బాగా ఉపకరిస్తోంది. డెంగ్యూకు హోమియో పిల్స్ ద్వారా ఉపశమనం కలగడంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దీర్ఘకాలిక రోగాలకు మందులు : దీర్ఘకాలిక రోగాలైన బీపీ, షుగర్, ఆస్మా, కిడ్నీ సమస్యలు, గుండె, ఊపిరితిత్తులు, దగ్గు, ఉబ్బసం, చర్మ వ్యాధులకు అన్ని వయసుల వారికి హోమియో మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. ప్రతీరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రిలో వైద్యురాలు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

అన్ని రకాల వైద్య సేవలు



వయసుతో సంబంధం లేకుండా అన్ని రకాల రోగాలకు ఆస్పత్రిలో మందులు లభ్యం అవుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్పత్రిలో అందుబాటులో ఉంటాం. సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కళావతి, హోమియో వైద్యురాలు, అగనంపూడి ఆస్పత్రి

నకిలీ పత్రాలతో బార్ రెన్యువల్

- టీడీపీ కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు నిర్వాకం
- శ్రీ దుర్గా బార్ అండ్ రెస్టారెంట్ మూసివేత
- లైసెన్స్ రద్దు చేసిన ఎక్సైజ్ అధికారులు



కూర్మన్నపాలెం మెయిన్‌రోడ్డులో మూసివేసిన శ్రీ దుర్గా బార్ అండ్ రెస్టారెంట్

కూర్మన్నపాలెం: నకిలీ పత్రాలతో రెన్యువల్ చేస్తూ అటు అధికారులను.. ఇటు ప్రభుత్వాన్ని మోసం చేసి కూర్మన్నపాలెం మెయిన్‌రోడ్డులో అక్రమంగా నడుపుతున్న శ్రీ దుర్గా బార్ అండ్ రెస్టారెంట్‌ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు గురువారం రాత్రి మూసివేశారు. గ్రీన్‌సిటీకి చెందిన బండి సురేష్‌కుమార్‌కు చెందిన భవనంలో టీడీపీ కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు కొన్ని సంవత్సరాలుగా సదరు బార్‌ను నిర్వహిస్తున్నారు. అద్దె చెల్లించకుండా నకిలీ ధ్రువపత్రాలతో రెన్యువల్ చేయించుకుంటున్నారు. భవన యజమాని ఫోర్జరీ సంతకాలతో బార్‌ను కొనసాగిస్తున్నారు. తన ప్రమేయం లేకుండా దొంగ సంతకాలతో కూడిన పత్రాలు సమర్పిస్తున్నట్లు సదరు భవన యజమాని ఇటీవల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేసిన ఎక్సైజ్ అధికారులు బార్ లైసెన్సు రెన్యువల్‌కు జత చేసిన పత్రాలు నకిలీవని గుర్తించడంతో ఎట్టకేలకు లైసెన్సును రద్దు చేసి బార్‌ను మూసివేశారు.

ప్రైవేటీకరణను విరమించే వరకు ఉద్యమం



988వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం విరమించే వరకు ఉక్కు కార్మికుల ఉద్యమాలు కొనసాగుతాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షల్లో 988వ రోజు శుక్రవారం, సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మికులు ఎంతగానో శ్రమించారన్నారు. కానీ కార్మిక శక్తికి విలువ లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ అంశాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంటును నష్టాల ఊబిలోకి నెట్టేందుకు యాజమాన్యం ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

డ్రై డే పాటిస్తే వ్యాధులు దూరం



ఫ్రై డే - డ్రై డే కార్యక్రమంలో మాట్లాడుతున్న మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా వ్యాధులకు చెక్ చెప్పవచ్చని మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు అన్నారు. ఫ్రై డే – డ్రై డే కార్యక్రమంలో భాగంగా 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో స్వచ్ఛ సంకల్ప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం ఇంటి పరిసరాలను డ్రైగా ఉంచాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలకు కారణమైన టైర్లు, కొబ్బరి బొండాలు తొలగించాలన్నారు. పూలకుండీలు, రోళ్లు వంటి వాటిలో నీటిని తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వ్యాప్తి, దోమల వల్ల వ్యాపించే వ్యాధులు, నివారణపై అవగాహన కల్పించారు. పలు నివాసాల్లో నీటి నిల్వలున్న డ్రమ్ములను పరిశీలించారు. అనంతరం స్వచ్ఛ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ డి.వి.రామారావు, 69వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్, వార్డు సచివాలయ సిబ్బంది, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు ఏర్పాట్లు

- చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ నేడు
- ఇప్పటికే పూర్తయిన ఏర్పాట్లు



చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ కోసం నిర్మిస్తున్న వేదిక

తగరపువలస: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా శనివారం మధ్యాహ్నం చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ జరగనుంది. ఈ యాత్రలో భాగంగా ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు మీడియా సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం యాత్రలో పాల్గొన్న మంత్రుల బృందం చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బోయిపాలెం కూడలి నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీ ప్రారంభమై తగరపువలస వరకు సాగుతుంది. చివరగా చిట్టివలస బంతాట మైదానంలో మధ్యాహం 3 గంటలకు జరిగే బహిరంగ సభకు జీవీఎంసీ, భీమిలి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారు. బహిరంగ సభకు 30 వేల మంది వరకు హాజరుకానున్నట్టు అంచనా వేశారు. ప్రజల సౌకర్యార్థం 16 వేల కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.

బస్సు యాత్ర విజయవంతానికి కృషి

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డితో గురు, శుక్రవారాల్లో బహిరంగ సభ ప్రదేశాన్ని పరిశీలించారు. మరోవైపు శుక్రవారం మధురవాడ జోన్ ఏసీపీ ఎం.శివరామిరెడ్డి, భీమిలి సీఐ డి.రమేష్ చిట్టివలస బంతాట మైదానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

ఉన్నచోటే ఉన్నత వైద్యం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి వెల్లడి
- 65, 73, 85, 86 వార్డుల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



85వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



65వ వార్డు గిరిజా కాలనీ యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఉన్నచోటే ఉన్నత వైద్యం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 65వ వార్డు సంజీవగిరి సచివాలయ పరిధి సంజీవగిరి కాలనీ, భానోజీ కాలనీలకు సంబంధించి గిరిజా కాలనీ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత విస్తరించడమే కాకుండా ప్రతీ ఇంటికి వైద్యాధికారులు వెళ్లి వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు.

502 మందికి వైద్య సేవలు

శిబిరంలో 502 మందికి 8 మంది వైద్యులు వైద్యసేవలు అందించారు. స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరలక్ష్మితో పాటు అక్కిరెడ్డిపాలెం, గంగవరం, కొత్త గాజువాక, సిద్ధేశ్వరం ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ప్రియాంక, వినయ్‌కుమార్, రాజు, మానస, మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ ప్రసూన యాదవ్, ఎముకల డాక్టర్ సయ్యద్ అజ్మాల్, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ మానస, సిబ్బంది వైద్య పరీక్షలతో పాటు రక్తపరీక్షలు, ఇతర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ నరసింహపాత్రుడు, ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్, క్లస్టర్ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మంగునాయుడు పాల్గొన్నారు.

73వ వార్డులో 260 మందికి..

73వ వార్డు పెదగంట్యాడ సచివాలయం–3 పరిధి చిన్న నడుపూరు, వినాయక నగర్‌కు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నెల్లిముక్కు పట్టణ ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో 260 మంది రోగులకు సేవలు అందించారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేష్‌బాబు, ఈఎన్‌టీ వైద్యుడు నాగరాజు, నేత్ర వైద్యురాలు డాక్టర్ అక్షిత, జనరల్ ఫిజీషియన్ అఖీలా వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌కుమార్, తనకాల సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

85వ వార్డులో..

అగనంపూడి: పేదల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు వెచ్చిస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 85వ వార్డు పెదమడకలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం ముఖ్యమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భావిస్తున్నారని, అందుకే ప్రతీ ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జెడ్పీ సింహాచలం, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, నాయకులు నక్కా రమణ బాబు, దానబోయిన అప్పలనాయుడు, గెద్దద అప్పలరాజు, పాట్నా రామకృష్ణ, బల్లా పైడిరాజు పాల్గొన్నారు.

86వ వార్డులో 401 మందికి..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం సచివాలయ పరిధిలో ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కణితి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శుక్రవారం వైద్య సేవలు అందించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు శిబిరాన్ని పరిశీలించి, రోగులకు మందులు అందజేశారు. వైద్య శిబిరంలో సుమారు 401 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, మండల జేఏసీ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, శ్రీనివాస్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి వరలక్ష్మి



73వ వార్డు నెల్లిముక్కు యూపీహెచ్‌సీలో నేత్ర పరీక్ష చేస్తున్న డాక్టర్ అక్షిత



86వ వార్డులోని వైద్య శిబిరంలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నేడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో శనివారం వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర జిల్లాల కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరు కానున్నారని చెప్పారు. ఈ మేరకు వికాస్ నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో సీవోలు, ఆర్పీలు, వలంటీర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ సమావేశానికి కార్పొరేటర్లు, పార్టీ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, గృహసారథులు, కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

6న పాత గాజువాక జంక్షన్‌కు బస్సుయాత్ర

వచ్చే నెల 6న సాయంత్రం 4 గంటలకు మంత్రుల బస్సుయాత్ర పాత గాజువాక జంక్షన్‌కు చేరుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రులకు ఘన స్వాగతం పలకాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, జోనల్ కమిషనర్ సింహాచలం, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వెటరన్ అథ్లెట్ మీట్ రేపు

మురళీనగర్: విశాఖ జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఆదివారం వెటరన్ అథ్లెటిక్స్ మీట్ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.బాబూరావు, మంగా వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రన్నింగ్ 100 మీ., 200 మీ., 400 మీ., 800 మీ., 1500 మీ., 5000 మీ., వాకింగ్ 5 కి.మీ, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, హేమర్ త్రో వంటి క్రీడల్లో పోటీలు జరుగుతాయన్నారు. 30 ఏళ్లు దాటిన వారందరూ పాల్గొనవచ్చని, వయసుల వారీగా విభజించి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు వారి పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో రావాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన వారిని నవంబర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. పాల్గొన్న వారికి స్నాక్స్, మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. వివరాలకు 97013 47311, 98666 68966, 83091 57522, 92474 24395 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

సమస్యల పరిష్కారం కోరుతూ సీపీకి వినతులు

దొండపర్తి : పోలీస్ సిబ్బంది సమస్యలు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీసుల సమస్యల పరిష్కారానికి సీపీ శుక్రవారం తన ఛాంబర్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 13 మంది సిబ్బంది తమ సమస్యలను వినతుల రూపంలో సీపీకి తెలిపారు. ఇందులో ప్రమోషన్లు, క్వార్టర్లు, విభజన సమయంలో అనకాపల్లికి వెళ్లిన ఆరుగురు సిబ్బందిని తిరిగి నగర పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ సీపీకి వినతులు అందజేశారు.

కేవీపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



కేవీపీతో కాంగ్రెస్ నాయకులు

గాజువాక : రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావును గాజువాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం కలిశారు. విశాఖ విచ్చేసిన ఆయన్ను కాంగ్రెస్ పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షుడు గొంప గోవిందరాజు ఆధ్వర్యంలో కలిసి, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంతో పాటు గాజువాకలోని వివిధ వార్డుల్లో సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

కేవీపీని కలిసిన వారిలో గాజువాక సమన్వయకర్త గవర వెంకట రమణారావు, నాయకులు షేక్ అస్మత్ అలీ, చట్టి సింహాచలం, ఎలమంచిలి సన్యాసిరావు, సీహెచ్.మురళీశ్వరరావు, పెద్దాడ అప్పలరాజు తదితరులున్నారు.

చీటీల పేరుతో టోకరా!

- 30 మంది వద్ద రూ.50 లక్షలు వసూలు
- ఆర్నెల్లుగా పరారీలో నిర్వాహకురాలు

పెందుర్తి: చీటీల పేరుతో ఓ మహిళ తమను మోసం చేసిందని బాధితులు శుక్రవారం పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. దాదాపు 30 మందికి రూ.50 లక్షలకు పంగనామం పెట్టింది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..పెందుర్తి అఖిలేశ్వరి ఆస్పత్రి సమీపంలో మెండ పార్వతి అనే మహిళ చాలాకాలంగా చీటీలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో వివిధ రకాల చీటీల పేరుతో దాదాపు 30 మంది వద్ద రూ.50 లక్షల వరకు వసూలు చేసింది.

అయితే పాడుకున్న నగదు తన వద్ద ఉంచితే అధిక వడ్డీ ఇస్తానని నమ్మించి ఆ నగదు తన వద్దే ఉంచుకునేది. అయితే వడ్డీ సక్రమంగా ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి వారు పార్వతిని నిలదీశారు. దీంతో ఆర్నెల్ల కిందట ఆమె పెందుర్తి నుంచి పరారైంది. ఆమె ఆచూకీ కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో బాధితులు శుక్రవారం పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.